క్లుప్తంగా

ఈ నెలా కందిపప్పు లేనట్టే!

బియ్యం, పంచదారతోనే సరి పెట్టనున్న ప్రభుత్వం



సత్తెనపల్లి: ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా కందిపప్పు సరఫరాపై రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ నెలలో కూడా చేతులెత్తేసింది. బియ్యం, పంచదారతోనే సరిపెట్టనుంది. గత నెలలో కేవలం బియ్యం మాత్రమే సరఫరా చేశారు. ఈనెల బియ్యంతో పాటు అరకొరగా పంచదార పంపిణీ చేయనున్నారు. ఈసారి అవి అందరికీ దక్కేలా లేవు. నియోజకవర్గాలకు సరుకు సరఫరా చేయకపోవడంతో ఉన్న నిల్వలతోనే పంపిణీ చేయాలని అధికారులు నిర్ణయించారు. గత ప్రభుత్వ హయాంలో బియ్యం పంచదారతో పాటు కందిపప్పు, గోధుమ పిండి అందజేసేవారు. సెప్టెంబర్‌లో వినాయక చవితి పర్వదినం సందర్భంగా ప్రభుత్వం కందిపప్పు ఇస్తుందని ఆశించినా కార్డుదారులకు నిరాశే మిగిలింది.

క్రోసూరు ఎస్‌ఐ నాగేంద్రరావు బాధ్యతల స్వీకారం



క్రోసూరు: క్రోసూరు ఎస్‌ఐగా కె.నాగేంద్రరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నకిరేకల్లు ఎస్‌ఐగా పని చేస్తూ బదిలీ పై ఇక్కడకు వచ్చారు. అదేవిధంగా ఇక్కడ పనిచేసిన ఎస్‌ఐ ఎస్ఎం షఫీ నాగార్జునసాగర్‌కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ నాగేంద్రరావు విలేకరులతో మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని చెప్పారు. పోలీసు సిబ్బంది నూతన ఎస్‌ఐకు శుభాకాంక్షలు తెలిపారు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రోడ్లు కేటాయించాం

అచ్చంపేట తహసీల్దార్ శ్రీనివాసయాదవ్

అచ్చంపేట: ఉన్నతాధికారులనుంచి వచ్చిన ఉత్తర్వుల మేరకు.. రైతుల అభ్యర్థన మేరకు వారి భూముల్లోకి వెళ్లేవిధంగా 11 రోడ్లకు స్థలాలను కేటాయించి హద్దులు వేసినట్లు తహసీల్దార్ జి.శ్రీనివాసయాదవ్ బుధవారం తెలిపారు. స్థానిక చామర్రు రోడ్డుకు తూర్పు పక్కన గత కొంతకాలంగా స్థలాలను ఆక్రమించుకుని కొంతమంది నిరుపేదలు నివాసాలు ఏర్పరచుకున్నారన్నారు. దాంతో రైతులు మెయిన్ రోడ్డునుంచి ఎవరి భూముల్లోకి వాళ్లు వేళ్లేందుకు అనుకూలంగా 11 చోట్ల రోడ్లను ఏర్పాటు చేయాలని కోరుతూ హైకోర్టు, జిల్లా కలెక్టరును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాలమేరకు గతంలో ఇక్కడ పనిచేసిన తహసీల్దారు రైతులు వారి భూములలోకి వెళ్లే విధంగా రోడ్డుకు కావలసిన స్థలాలను కేటాయించి హద్దులను నిర్ణయించినట్లు చెప్పారు. ఈ క్రమంలో కొంత మంది అవగాహన లేక హద్దులోపలికి వచ్చేవిధంగా ఇళ్ల నిర్మాణాలను చేపట్టారన్నారు. రైతులు మళ్లీ ఉన్నతాధికారులను ఆశ్రయించడంతో వారి ఆదేశాలమేరకు హద్దులోపలికి వచ్చిన వారి ఇళ్లను మాత్రమే తొలగించడం అనివార్యమైందన్నారు. దీనివల్ల ఇద్దరు, ముగ్గురు నివాసాలు కోల్పోయి ఇబ్బందులకు గురైఉన్నట్లయితే వారు తహసీల్దారు కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి వారికి వేరే చోట నివాసస్థలం కేటాయించే ఏర్పాటు చేస్తామని తహసీల్దారు స్పష్టం చేశారు.

గల్లంతైన వ్యక్తి కోసం గాలింపు

పిడుగురాళ్ల: మండలంలోని కోనంకి గ్రామంలోని పిల్లేరు వాగులో గల్లంతైన శీలం శ్రీనివాసరావు కోసం పట్టణ పోలీసులు బుధవారం గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం ఇసుక మేట వేసిన నీటి మోటారును వెలికితీసేందుకు పిల్లేరు వాగులో దిగిన శ్రీనివాసరావు వాగు ప్రవాహ ఉధృతికి గల్లంతయ్యాడు. బుధవారం రాత్రివరకు గాలించినా ఆచూకీ దొరకలేదని పట్టణ ఎస్‌ఐ ఎం.మోహన్ తెలిపారు. గజ ఈతగాళ్లతో, ప్రత్యేక పడవల సహాయంతో, తాళ్ల సహాయంతో గల్లంతైన ప్రాంతంతోపాటు నీటి ప్రవాహ ప్రాంతాల్లో కూడా గాలింపు చర్యలు చేపట్టటం జరిగిందన్నారు. పిల్లేరు వాగులో మొసళ్లు సంచరిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు.

9న అతిథి అధ్యాపకుల పోస్టులకు ఇంటర్వ్యూ

విజయపురిసౌత్: స్థానిక ఏపీఆర్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 9వ తేదిన అతిథి అధ్యాపక పోస్టులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వైఎస్ఎస్ చౌదరి బుధవారం తెలిపారు. కామర్స్–2 పోస్టులు, ఎకనామిక్స్–1, తెలుగు–1, మ్యాథ్స్–1, కెమిస్ట్రీ–1, కంప్యూటర్ సైన్స్–1 మొత్తం 7 పోస్టులకు ఇంటర్వ్యూ జరుగుతుందన్నారు. అభ్యర్థులు సంబంధిత పీజీ సబ్జెక్ట్‌లో 55శాతం మార్కులను కలిగి ఉండాలన్నారు. ఎంఫిల్, పీహెచ్‌డీ, యూజీసీ నెట్, ఏపీ సెట్‌లో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఇంగ్లిష్ మీడియంలో పాఠాలు చెప్పగలిగే అభ్యర్థులే అర్హులన్నారు. ఆసక్తి గలవారు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో ఈనెల 9వ తేదీ ఉదయం 10గంటలకు జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. ఆసక్తిగల వారు aprdc. nagarjunarafar@gmai.com కు రెజ్యూమ్ పంపించాలన్నారు.

పారదర్శకంగా పంటనష్టం అంచనాలు

- జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి
- పాటిబండ్లలో నీట మునిగిన పత్తి పంట పరిశీలన



పాటిబండ్లలో నీట మునిగిన పత్తి పంటను పరిశీలిస్తున్న డీఏఓ మురళి, వ్యవసాయాధికారులు



పెదమక్కెనలో పురుగు మందుల దుకాణంలో తనిఖీలు చేపడుతున్న డీఏఓ మురళి

పెదకూరపాడు: వరద ఉధృతికి నష్టపోయిన పంట నష్టం అంచనాలు పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా వ్యవసాయశాఖాధికారి ఐ.మురళి అధికారులను ఆదేశించారు. మండలంలోని పాటిబండ్ల గ్రామంలో వరద ఉధృతికి నష్టపోయిన పత్తి పంటలను, వ్యవసాయశాఖాధికారుల బృందంతో కలసి పరిశీలించారు. ఈ నెల 10వ తేదీలోపు పంట నష్టం అంచనాలు వేయాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పత్తి పంటలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు. ఈ సందర్భంగా రైతులు తమ గోడును వ్యవసాయశాఖాధికారుల దృష్టికి తీసుకొచ్చారు. పూర్తిగా నష్టపోయామని ఆదుకోవాలని కోరారు. పత్తి పంటలో తీసుకోవాల్సిన చర్యలను అధికారులు ప్రతి రైతుకు వివరించాలన్నారు. సత్తెనపల్లి వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీధర్‌రెడ్డి, వ్యవసాయశాఖాధికారి ఇంజం శాంతి, విస్తరణ అధికారి శేషు పాల్గొన్నారు.

పత్తిలో సస్యరక్షణ చేపట్టాలి

సత్తెనపల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా ఇటీవల అధికంగా వర్షాలు కురిసి నీరు నిలిచిన పత్తి పంట పొలాల్లో నీటి నిల్వలు తొలగించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఐ.మురళీ అన్నారు. సత్తెనపల్లి మండలంలో నందిగామలో అధిక వర్షాలకు గురైన పొలాలను బుధవారం ఆయన పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. సత్తెనపల్లి సబ్ డివిజన్ ఇన్‌చార్జీ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్.శ్రీధర్‌రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు జి.గోపీకృష్ణ, షేక్ మౌలాలి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఎరువుల స్టాక్ బోర్డు ప్రదర్శించాలి

సత్తెనపల్లి: డీలర్లు ప్రతి రోజు ఎరువుల స్టాక్ డిస్‌ప్లే బోర్డులు దుకాణాల్లో ప్రదర్శించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఐ.మురళి పేర్కొన్నారు. సత్తెనపల్లి మండలం పెదమక్కెన గ్రామంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాన్ని బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. డీఏఓ మురళీ మాట్లాడుతూ డీలర్లు రైతులకు ఎరువుల అమ్మకాలు జరిపేటపుడు తప్పనిసరిగా బిల్లుపై రైతు ఫోన్ నంబర్, వారి పూర్తి వివరాలు నమోదు చేయాలని సూచించారు. అమ్మకాలు జరిపిన ఎరువులను ఈ–పాస్ మెషీన్‌లో కూడా ప్రతి రోజు అప్‌డేట్ చేయాలన్నారు. ఎరువుల భౌతిక నిల్వలు, ఈ–పాస్ మెషీన్ ఆన్‌లైన్‌లో నిల్వలు ప్రతి రోజూ సరి పోల్చుకోవాలని సూచించారు.

పంటనష్టం నమోదు ప్రారంభం

క్రోసూరు: మండలంలోని అందుకూరు, బాలమర్రు గ్రామాలలో అధిక వర్షాలకు దెబ్బతిన్న పంటలను మండల వ్యవసాయాధికారి వేణుగోపాల్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ వ్యవసాయ కమిషనర్, జిల్లా కలెక్టర్, ఉత్తర్వుల ప్రకారం అధిక వర్షాలకు దెబ్బతిన్న పంటల వివరాలను గ్రామస్థాయి టీం సభ్యులైన రైతు సేవా కేంద్ర సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారి, పంచాయతీ సెక్రటరీలచే నమోదు చేయడం ప్రారంభించినట్లు చెప్పారు. మండల స్థాయిలో ఈ ప్రక్రియను మండల వ్యవసాయ అధికారి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, తహసీల్దార్‌లు పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం 33 శాతం కంటే ఎక్కువ పంట నష్టం జరిగిన పైర్లను పంట నష్ట పరిహార జాబితాలో నమోదు చేయడం జరుగుతుందన్నారు.

అచ్చంపేటలో...

అచ్చంపేట: తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న పంటనష్టాలను అంచనా వేసేందుకు వ్యవసాయ, రెవెన్యూ సిబ్బందిని ప్రత్యేక టీములుగా నియమించినట్లు వ్యవసాయ సహాయ సంచాలకులు వి.హనుమంతరావు తెలిపారు. మండలంలోని ఓర్వకల్లు, రుద్రవరం, కోనూరు, కస్తల, చింతపల్లి, కొత్తపల్లి గ్రామాలలో ఆయన ఏవో వెంకటేశ్వర్లుతో కలసి ముంపునకు గురైన పంటలను పరిశీలించారు. స్థానిక రైతులు, రైతుసేవా సిబ్బంది షరీఫ్, హర్ష, శ్రీను పాల్గొన్నారు.

సత్తెనపల్లి డివిజన్ నుంచి వరద బాధితులకు సాయం

- 10 వేల బిస్కెట్ ప్యాకెట్లు, 20 వేల నీటి బాటిళ్లు
- ప్రత్యేక వాహనంలో కలెక్టర్ కార్యాలయానికి తరలింపు



కలెక్టర్ కార్యాలయానికి బిస్కెట్ ప్యాకెట్లు, వాటర్‌బాటిళ్లు పంపుతున్న ఆర్డీఓ మురళీకృష్ణ, అధికారులు

సత్తెనపల్లి: ప్రకృతి వైపరీత్యాల సమయంలో బాధితులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని సత్తెనపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి వి.మురళీకృష్ణ అన్నారు. విజయవాడ ప్రాంతం వరదలతో నష్టపోయిన నేపథ్యంలో పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశాల మేరకు విజయవాడ వరద బాధితులకు బుధవారం సాయం పంపారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మురళీకృష్ణ మాట్లాడుతూ వర్షాల కారణంగా వరదలు ముంచెత్తి అనేకమంది సరైన ఆహారం దొరక్క ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ క్రమంలో దాతలు చేయుత అందించాల్సిన అవసరం ఉంద న్నారు. సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్ నుంచి 10 వేల బిస్కెట్ ప్యాకెట్లు, 20వేల అరలీటర్ వాటర్ బాటిళ్లను విజయవాడలోని వరద బాధితుల సహాయార్థం పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి ప్రత్యేక వాహనంలో తరలిస్తున్నామన్నారు. సత్తెనపల్లి తహసీల్దార్ కె. శ్రీనివాస చక్రవర్తి, డీఏఓ చంద్రారెడ్డి, పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్ అరుణ, సిబ్బంది ఉన్నారు.

రాజుపాలెం: విజయవాడ వరద బాధితులకు మండలంలోని ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది రూ.24,500ల విలువ జేసే ఆహార పదార్థాలను బుధవారం అందజేశారు.

పీహెచ్‌సీ సిబ్బంది సాయం

ముప్పాళ్ళ: పల్నాడు జిల్లా కలెక్టర్, డీఎంహెచ్‌ఓల విజ్ఞప్తి మేరకు విజయవాడ వరద బాధితులకు సాయం అందించేందుకు ముప్పాళ్ళ పీహెచ్‌సీ సిబ్బంది ముందుకు వచ్చారు. పీహెచ్‌సీ వైద్యులు పి.రమాదేవి, ఓ.జయకృష్ణప్రవీణ్ ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది స్వచ్ఛందంగా తమ వంతుగా రూ.20,500లు విలువ చేసే బిస్కెట్లు, వాటర్‌బాటిళ్లు, క్యాండిళ్లు, అగ్గిపెట్టెలు జిల్లా వైద్యాధికారికి అందించారు.

క్రోసూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో...

క్రోసూరు: పల్నాడు జిల్లా కలెక్టర్, డీఎంహెచ్‌ఓ రవి విజ్ఞప్తి మేరకు పల్నాడు జిల్లా క్రోసూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ సిరి చందన, డాక్టర్ మహమ్మద్ షాద్, ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యాంసన్, సిబ్బంది ఆధ్వర్యంలో వరద బాధితులకు వాటర్ బాటిళ్లు, బిస్కెట్ ప్యాకెట్లు, క్యాండిళ్లు తదితర వస్తువులను డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి బుధవారం పంపారు.

అచ్చంపేట: విజయవాడ వరద బాధితులకు తమ వంతు కర్తవ్యంగా రూ.80వేలు విలువచేసే బిస్కెట్లు, వాటర్ బాటిళ్లు, కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలు తదితర వస్తువులను బుధవారం పల్నాడు జిల్లా కలెక్టరుకు పంపినట్లు తహసీల్దారు జి.శ్రీనివాసరావు, ఎంపీడీవో పి.సుబ్రమణ్యం తెలిపారు.

పెదకూరపాడు: విజయవాడ వరద బాధితులకు పెదకూరపాడు సర్పంచ్ గుడిపూడి రాజు, మండల పరిషత్ సిబ్బంది సుమారు రూ.లక్ష విలువ చేసే బిస్కెట్లు, వాటర్ బాటిళ్లు, క్యాండిళ్లు, అగ్గిపెట్టెలను అందించారు. ఎంపీడీవో సరసింహారావుకు ఈమొత్తాన్ని అందజేశారు.

వరద బాధితులకు 7 వేల బిస్కెట్ ప్యాకెట్లు

సత్తెనపల్లి: పట్టణంలోని యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో 7 వేల బిస్కెట్ ప్యాకెట్లు విజయవాడ వరద బాధితుల సహాయార్థం పంపేందుకు సిద్ధం చేశారు. ఈమేరకు బిస్కెట్ ప్యాకెట్లను ఆర్డీఓ కార్యాలయానికి పంపినట్లు బ్యాంకు మేనేజర్ చంద్రశేఖర్ నాయక్ బుధవారం తెలిపారు. బ్యాంక్ సిబ్బందితో పాటు, బ్యాంక్ గోల్డ్ అప్రైజర్ కునాగు బుజ్జి సహకారంతో బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశామన్నారు.

గణేశ్ మండపాలకు సింగిల్ విండో అనుమతులు

సత్తెనపల్లి రూరల్ పీఎస్ ఎస్‌హెచ్‌ఓ పోలూరి శ్రీనివాసరావు



సత్తెనపల్లి: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని వినాయక చవితి విగ్రహాల ప్రతిష్ఠ, చవితి పందిళ్లు, మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు తప్పనిసరిగా ముందస్తుగా అనుమతులు తీసుకోవాలని సత్తెనపల్లి రూరల్ ఎస్‌హెచ్‌ఓ పోలూరి శ్రీనివాసరావు అన్నారు. ఈ నెల 7న వినియచవితి పర్వదినాన్ని పురస్కరించుకొని వినాయక మండపం ఏర్పాటు చేసే వారికోసం ప్రత్యేకంగా ఒక సింగిల్ విండో క్లియరెన్స్ విధానం ముందుకు తీసుకురావడం జరిగిందని, ఇందులో భాగంగా 79950 95800 మొబైల్ నెంబర్‌కు నిర్వాహకులు హాయ్ అని వాట్సాప్ సందేశం పంపిస్తే నిరభ్యంతర పత్రం కోసం అనుసరించవలసిన ప్రక్రియ మొత్తం మొబైల్ ఫోన్‌కి వస్తుందన్నారు. ఆ తర్వాత http//ganeshutsav.net అనే వెబ్‌సైట్‌లో గణేష్ మండపం ఏర్పాటు సభ్యుల వివరాలు, మండపం వివరాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ దరఖాస్తు సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకి వెళ్తుందన్నారు. ఎస్‌హెచ్‌ఓ ఆధ్వర్యంలో పురపాలక శాఖ, అగ్నిమాపక శాఖ, విద్యుత్ శాఖల యొక్క సిబ్బంది ఒక బృందంగా ఏర్పడి మండపం ఏర్పాటు చేసే ప్రదేశాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించి సానుకూలంగా ఉంటే క్యూఆర్ కోడ్ తో కూడిన నిరభ్యంతర పత్రం జారీ చేస్తారన్నారు. అనుమతికి అవసరమైన రుసుము వివరాలను కూడా తెలియజేస్తారన్నారు. దగ్గరలో ఉన్న మీసేవ కేంద్రంలో తగిన రుసును చెల్లించి ఆ రసీదును వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తే ఎస్‌హెచ్‌ఓ వాటిని పరిశీలించి వెంటనే నిరభ్యంతర పత్రం జారీ చేస్తారన్నారు. ఈ నిరభ్యంతర పత్రాన్ని ప్రింట్ తీసి గణేష్ మండపంలో ఉంచాలన్నారు. సత్తెనపల్లి మండల పరిధిలోని ప్రజలందరూ ప్రశాంతమైన వాతావరణంలో పండగ జరుపుకోవాలని ఆయన కోరారు.

పెదకూరపాడు: వినాయక చవితి విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని పెదకూరపాడు ఎస్‌ఐ బాలునాయక్ తెలిపారు. విలేకరుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. పోలీసుల అనుమతితో రెవెన్యూ, విద్యుత్ అధికారుల అనుమతి కూడా ఉండాలన్నారు. ఫ్లెక్సీలను అనుమతి లేదన్నారు.

బెల్లంకొండ: గ్రామాల్లో ఎటువంటి గొడవలు లేకుండా వినాయక చవితి ఉత్సవాలను నిర్వహించుకోవాలని ఎస్‌ఐ ఎస్.రాజేష్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో శాంతి కమిటీ, పలువురు ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. చవితి వేడుకలు నిర్వహణకు పోలీస్ శాఖ సూచించిన నిబంధనలు పాటించాలని సూచించారు.

నకరికల్లు: వినాయక చవితి మండపాలు ఏర్పాటు చేసేవారు తప్పనిసరిగా అనుమతులు పొందాలని ఎస్‌ఐ చల్లా సురేష్ ఆదేశించారు. మండలంలోని పలుగ్రామాల్లో వినాయకచవితి ఉత్సవ నిర్వాహకులతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వినాయకచవితి మండపాలు ఏర్పాటు చేసేవారు ముందుగా కమిటీ ఏర్పాటు చేసుకోవాలన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఇరువురు ఎంపిక



గోపరాజు బసవరాజు



సీహెచ్ అమృతవాణి

సత్తెనపల్లి: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు సత్తెనపల్లి మండలం నుంచి ఒకరు .. సత్తెనపల్లి పట్టణం నుంచి మరొకరు ఎంపికయ్యారు. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. వీరిలో ఒకరు సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపరాజు బసవరాజు కాగా.. మరొకరు సత్తెనపల్లి పట్టణంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయ (కేజీబీవీ) కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ తెలుగు టీచర్ సీహెచ్ అమృతవాణిలు ఎంపికయ్యారు.

లయన్స్ క్లబ్ ఉత్తమ ఉపాధ్యాయులుగా నలుగురు ఎంపిక

సత్తెనపల్లి: భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ నలుగురు ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసిందని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పొన్నెకంటి కిషోర్ కుమార్ బుధవారం తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురు గల గో సంరక్షణ శాల కల్యాణ మండపంలో ఈనెల 5న సాయంత్రం 5 గంటలకు లయన్స్ క్లబ్ ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికై న వారికి సత్కారం జరుగుతుందన్నారు. చీదరబోయిన భానుమూర్తి (ఎస్ఏ, చంద్రారాజు పాలెం జెడ్పీ స్కూల్), బండి రమేష్ బాబు(ధూళ్ళిపాళ్ల ఎంపీపీఎస్ ఎస్‌జీటీ), చిలకా అగస్టస్‌బాబు(ఎస్ఏ, పాకాలపాడు ఎంపీయూపీఎస్), గోపరాజు బసవరాజు(రెంటపాళ్ల జడ్పీ స్కూల్ హెచ్ఎం), నక్కా సూరిబాబు(ఎస్ఏ, నరసరావుపేట శంకర భారతి పురం జెడ్పీస్కూల్)లు ఎంపికయ్యారన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, సత్తెనపల్లి, పెదకూరపాడు ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, భాష్యం ప్రవీణ్ కుమార్‌లు, విశిష్ట అతిథిగా సత్తెనపల్లి ఎంఈఓ అనంతవరం శ్రీనివాసరావు హాజరవుతారన్నారు.

పంట కోత ప్రయోగంపై అవగాహన

ముప్పాళ్ళ: మండలంలోని చాగంటివారిపాలెం గ్రామం రైతుభరోసా కేంద్రంలో పంట కోత ప్రయోగంపై రెవెన్యూ, వ్యవసాయశాఖ సిబ్బందికి బుధవారం అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.భవానిశంకర్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలోను వ్యవసాయశాఖ, రెవెన్యూ శాఖ సమన్వయంతో పంటకోత ప్రయోగం చేపట్టాలన్నారు. వరి పంటకు సంబంధించి అన్ని గ్రామాల్లోను ఈ ప్రయోగం ద్వారా దిగుబడి నమోదు చేయాల్సి ఉంటుందని, మిగతా పంటల దిగుబడికి సంబంధించి కేటాయించి గ్రామాల్లోనే పంటకోత ప్రయోగం చేపట్టాల్సి ఉంటుందన్నారు. అందుకు సంబంధించిన విధివిధానాలు త్వరలో పంపించటం జరుగుతుందన్నారు. ఏఓ ఎం.అరుణ మాట్లాడుతూ ఈ పంట కోత ప్రయోగం విధానం ద్వారా ఆయా పంటల దిగుబడి తెలుస్తుందన్నారు. వ్యవసాయశాఖ, రెవెన్యూ శాఖల సిబ్బంది సహకారంతో ప్రయోగం చేపట్టే పొలం వివరాలు సంబంధిత రికార్డుల్లో నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. మండల గణాంక అధికారి శ్రీలక్ష్మి పంటకోత ప్రయోగం చేపట్టే విధానం పై అవగాహన కల్పించారు. డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, ఆయా గ్రామాల వీఆర్వోలు, ఏఈఓలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓలు

బెల్లంకొండ: వర్షాల కారణంగా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తహసీల్దార్ అఫ్రపున్నీసా బేగం తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మండల అధికారులతో కలిసి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా మూడు రోజుల సెలవుల అనంతరం పునఃప్రారంభమైన పాఠశాలల్లో సమస్యలు లేకుండా చూడాలని సూచించారు. పాఠశాల ఆవరణలో వర్షపు నీరు నిలిచిపోయి ఉండడంతో నీటిని బయటకు పంపే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం రుచికరమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. ఎంపీడీఓ బి.వెంకటరెడ్డి, ఎంఈఓ బాల సుందరరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్కే మస్తాన్‌షరీఫ్, సర్పంచ్ గడిపర్తి సముద్రం, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని ఎరువుల దుకాణాలపై కేసులు

సత్తెనపల్లి: రైతులు నష్టపోకుండా ఉండేందుకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో వివిధ జిల్లాలలో తనిఖీలు నిర్వహించి నిబంధనలను పాటించని కంపెనీలు, దుకాణాలపై కేసు నమోదు చేయించడం జరిగిందని లీగల్ మెట్రాలజీ, విజిలెన్స్ కమిటీ రాష్ట్ర సభ్యుడు డాక్టర్ చదలవాడ హరిబాబు అన్నారు. పట్టణంలోని ఎరువుల దుకాణాలపై బుధవారం దాడులు నిర్వహించారు. గాంధీచౌక్ సెంటర్‌లోని ఎరువులు దుకాణాలలో మందుల డబ్బాలు నిబంధనలకు అనుగుణంగా ఉన్నవో లేవో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్త తనిఖీల్లో భాగంగా సత్తెనపల్లి పట్టణంలో తనిఖీలు నిర్వహించామని, త్వరలో ఫుడ్ సేఫ్టీ అధికారులతో కలసి అన్ని హోటళ్లు, రెస్టారెంట్‌లు, ఫాస్ట్ ఫుడ్ సెంటను కూడా తనిఖీ చేయడం జరుగుతుంద న్నారు. కార్యక్రమంలో లీగల్ మెట్రాలజీ పల్నాడు జిల్లా అసిస్టెంట్ కంట్రోలర్ ఎస్.అల్లూరయ్య, సత్తెనపల్లి ఇన్‌స్పెక్టర్ షైక్ సైదా, పల్నాడు జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు పిల్లి యజ్ఞ నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

మద్దూరు లోలెవల్ బ్రిడ్జికి మరమ్మతులు చేయాలి



పెదమద్దూరు వాగుపై ఉన్న లోలెవల్ బ్రిడ్జిని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

అమరావతి: నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే మద్దూరు లోలెవల్ చప్టాకు సత్వరమే మరమ్మతులు చేపట్టి ప్రమాదాలు నివారించి ప్రయాణికుల రాకపోకలను పునరుద్ధరించాలని సీపీఎం మండల కార్యదర్శి బి.సూరిబాబు అన్నారు. పార్టీ ప్రతినిధుల బృందం బుధవారం పెద మద్దూరుపై ఉన్న లోలెవల్ బ్రిడ్జిని పరిశీలించారు. బి.సూరిబాబు మాట్లాడుతూ 50 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ బ్రిడ్జి ఇటీవల వచ్చిన వరద ప్రవాహానికి దెబ్బతినిందన్నారు. మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కృషితో పెదమద్దూరు నూతన బ్రిడ్జి నిర్మాణం 60 శాతం పూర్తయిందన్నారు. కూటమి ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆగిపోయిన బ్రిడ్జి నిర్మాణాన్ని సత్వరమే పూర్తి చేయాలన్నారు. ఈ ప్రతినిధి బృందంలో దళిత నాయకుడు దారా ప్రసాద్, మొహుద్దీన్, బలిజేపల్లి పౌలు ఉన్నారు

మట్టి వినాయకుడిని పూజిద్దాం



పెదకూరపాడు: మట్టి వినాయకుడిని పూజిద్దాం... పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అని స్థానిక జనచైతన్య సమితి కార్యదర్శి తుళ్ళూరి సాంబశివరావు అన్నారు. పెదకూరపాడులోని జనచైతన్య సమితి కార్యాలయంలో మట్టి వినాయక విగ్రహాలను తయారుచేశారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ రసాయనాలతో చేసిన విగ్రహాలను పూజించడం ద్వారా పర్యావరణం ప్రమాదంలో పడుతుందన్నారు. ఇప్పటికే పర్యావరణంలో అనేక మార్పులు వచ్చి పకృతి విలయతాండవం చేయడం చూస్తున్నామన్నారు. సహాయ కార్యదర్శి అన్నవరపు స్టాలిన్ బాబు మాట్లాడుతూ మట్టి విగ్రహాలను ఇంటింటికి అందిస్తామన్నారు. నిర్వాహకులు దాసరి విజయబెన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

పెదకూరపాడు: గర్భిణులు, బాలింతలు బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ మున్ని అన్నారు. మండలంలోని గారపాడు అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పోషకాహార మాసోత్సవాలు సందర్భంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మున్ని మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పాలు, గుడ్లు తల్లులు, గర్భిణులు మాత్రమే తీసుకోవాలన్నారు. ఆకుకూరలు, కూరగాయలు అధికంగా తీసుకోవడం ద్వారా పౌష్టికాహార లోపం నివారించవచ్చన్నారు.